సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 29 । మార్చి । 2024




భానుడి ప్రతాపం..

రోజురోజుకూ భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ముదురుతున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. 10లో▸



10 లక్షల నగదు పట్టివేత

మహేశ్వరం మండలంలోని మన్సాన్‌పల్లి-ఘట్టుపల్లి రహదారిపై పోలీసుల తనిఖీల్లో రూ.10 లక్షల నగదు పట్టుబడింది. 10లో▸



న్యూస్‌రీల్

నేడు షాద్‌నగర్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాక

షాద్‌నగర్: పట్టణ శివారులోని బైపాస్ రోడ్డులో ఉన్న కుంట్లరాంరెడ్డి గార్డెన్‌లో శుక్రవారం బీజేపీ నాయకుల సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ హాజరుకానున్నట్లు పార్టీ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు భారీ ఎత్తున బీజేపీలో చేరనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 2గంటలకు నిర్వహించే సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ ఎస్సీ స్టడీ సర్కిల్‌లో (నాదర్‌గుల్) ఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. స్టేట్ సర్వీసెస్, గ్రూప్స్, బ్యాంకింగ్ సర్వీసెస్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఉద్యోగాలకు ఫౌండేషన్ కోర్సుల్లో 100 మందికి మూడు నెలల పాటు రెసిడెన్షియల్ విధానంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. గతంలో స్టడీ సర్కిల్ ద్వారా కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవొద్దన్నారు. ఈనెల 30 వరకు స్పాట్ అడ్మిషన్ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. డిగ్రీ మార్కుల ద్వారా కేటాయింపు ఉంటుందన్నారు. ఎంపికైన వారు కుల, ఆదాయ, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలన్నారు. వివరాలకు 94405 21419, 81215 09153 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అనుమతి లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు



ముర్తుజపల్లి సమీపంలో భూమిని పరిశీలిస్తున్న అధికారులు

ఆమనగల్లు: అనుమతులు లేకుండా వెంచర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని జిల్లా అధికారులు హెచ్చరించారు. మున్సిపల్ పరిధిలోని ముర్తుజపల్లి గ్రామ సమీపంలో సర్వే నంబర్ 31లోని భూమిని గురువారం పరిశీలించారు. సర్వే నంబర్ 31లో ఉన్న తన 3.09 ఎకరాల భూమిని పక్కనే ఉన్న వెంచర్ నిర్వాహకులు ఆక్రమించుకుని అక్రమంగా మట్టి తవ్వుతున్నారని రైతు వెంకటకిషన్‌జీ ఇటీవల స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్, డీటీసీపీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీటీసీపీకి చెందిన ఏడీ సత్యభామ, ఆమనగల్లు తహసీల్దార్ లలిత, మున్సిపల్ కమిషనర్ వసంత, పలువురు అధికారులు సదరు భూమిని, ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు వెంకటకిషన్‌జీ తన భూమిలో మట్టిని తవ్విన గుంతలను చూపించారు. దీనికి సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు చెప్పారు.


గురునానక్ కళాశాలను సందర్శించిన డీసీపీ



సిబ్బందికి సూచనలు చేస్తున్న డీసీపీ సునితారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ ఇంజనీరింగ్ కళాశాలను మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి గురువారం సందర్శించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం పంపిణీ, స్ట్రాంగ్ రూమ్స్, రిసెప్షన్ సెంటర్స్ ఏర్పాటుపై తీసుకోవాల్సిన భద్రతా పరమైన చర్యలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్నికల సందర్భంగా నిర్వర్తించాల్సిన బాధ్యతలపై ఎలక్షన్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల నియమావళి, విధివిధానాలను వివరించారు. ఆమె వెంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో అనంత రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

3 రోజులే..



మున్సిపాలిటీల్లో ప్రాపర్టీ టాక్స్ వసూళ్లు అంతంతే..

- ఈనెల 31 తుది గడువు
- పూర్తయింది 70 శాతంలోపే..
- లక్ష్యం రూ.253.41 కోట్లు
- రూ.161.84 కోట్లు మాత్రమే వసూలు
- వచ్చిన పన్నులు సిబ్బంది వేతనాలకే సరి
- అభివృద్ధి పనులకు ప్రభుత్వంపైనే ఆధారం

ఆస్తిపన్ను వసూళ్లు (రూ.కోట్లలో..)

మున్సిపాలిటీ/కార్పొరేషన్	అసెస్‌మెంట్లు	లక్ష్యం	వసూలైంది
శంషాబాద్	15,500	14.25	10.10
మణికొండ	45,238	54.44	35.86
బండ్లగూడ జాగీర్	33,191	27.70	19.68
నార్సింగి	25,550	34.74	25.73
బడంగ్‌పేట్	40,125	27.59	17.10
మీర్‌పేట్	20,284	18.25	9.70
జల్‌పల్లి	36,263	19.17	5.76
తుక్కుగూడ	6,395	5.31	4.39
తుర్కయంజాల్	19,687	13.05	9.92
పెద్ద అంబర్‌పేట్	17,396	14.84	9.10
ఆదిబట్ల	5,552	2.79	1.01
ఇబ్రహీంపట్నం	6,855	4.88	4.05
శంకర్‌పల్లి	6,428	5.68	1.78
ఆమనగల్లు	5,483	1.75	0.94
షాద్‌నగర్	15,274	6.49	4.93
కొత్తూరు	2,642	2.48	1.79

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరో మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆస్తిపన్ను చెల్లింపునకు ఈనెల 31 తుది గడువు కాగా ఇప్పటి వరకు మెజార్టీ మున్సిపాలిటీల్లో వసూళ్లు 70 శాతం దాటలేదు. జిల్లాలోని మెజార్టీ మున్సిపాలిటీలు నగరానికి ఆనుకుని ఉన్నాయి. పల్లె పట్టణం తేడా లేకుండా శరవేగంగా విస్తరిస్తున్నాయి. కొత్తగా కాలనీలు, భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు వెలుస్తున్నాయి. ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం, క్షేత్రస్థాయి నుంచి పన్నులు సరిగా వసూలు కాకపోవడంతో ఆయా మున్సిపాలిటీలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. జిల్లా పరిధిలోని మూడు కార్పొరేషన్లు, 13 మున్సిపాలిటీల పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి మొత్తం రూ.253.41 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు రూ.161.84 లక్షలకు మించలేదు. మరో రూ.91.57 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.

శంషాబాద్‌లో అంతంతే..

అంతర్జాతీయ విమానాశ్రయం కొలువుదీరిన శంషాబాద్ మున్సిపాలిటీలోని మెజార్టీ ప్రాంతాలు 111 జీఓ పరిధిలో ఉన్నాయి. ఇక్కడ నిర్మాణాలకు అనుమతులు లేవు. పూర్తిగా అక్రమ కట్టడాలే. వీటిలో వందశాతం పెనాల్టీతో పన్నులు వసూలు చేస్తుంటారు. ఫలితంగా ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే ఇక్కడ ఆస్తిపన్ను రెట్టింపుస్థాయిలో ఉంటుంది. అయినా నిధుల కొరత తప్పడం లేదు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 15,500 ఆస్తులకు అసెస్ మెంట్స్ చేయగా, రూ.14.25 కోట్ల ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు రూ.10.10 కోట్లకు మించలేదు. పన్నుల చెల్లింపునకు తుది గడువు మరో మూడు రోజుల్లో ముగియనుండటంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు.

ప్రభుత్వం దయతలిస్తేనే..

మహేశ్వరం నియోజకవర్గంలో మీర్‌పేట్, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలతో పాటు బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఉంది. అత్యధిక నిర్మాణాలు ఈ ప్రాంతంలోనే జరుగుతున్నాయి. లక్ష్యానికి తగ్గట్టుగా పన్నులు వసూలు కావడం లేదు. మున్సిపల్ అధికారులు స్థానిక భవన యజమానులతో కుమ్మక్కై అసెస్‌మెంట్లు చాలా తక్కువగా వేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆస్తుల అసెస్‌మెంట్స్, హోర్డింగులు, ట్రేడ్ లైసెన్సులు, భవన నిర్మాణాలకు అనుమతుల జారీ రూపంలో వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలకు కూడా సరిపోవడం లేదు. పారిశుద్ధ్య నిర్వహణ, డ్రైనేజీలు, అంతర్గత రోడ్లు, మంచినీటి పైపు లైన్లు, పార్కులు వంటి చిన్నచిన్న అవసరాలకు ప్రభుత్వం వద్ద చేయిచాచాల్సి వస్తోంది. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే జల్‌పల్లిలో చాలా తక్కువ ఆస్తి పన్ను వసూలవుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మణికొండ టాప్

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీ సహా బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఉంది. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే అత్యధిక ఆస్తి పన్ను వసూలవుతున్న జాబితాలో మణికొండ టాప్‌లో ఉంది. భూముల వేలం, బహుళ అంతస్తుల భవనాలు అసెస్‌మెంట్స్, ట్రేడ్ లైసెన్సులు, అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు, ఐటీ అనుబంధ కంపెనీలు అధికంగా ఉండడం కలిసివస్తోంది. ప్రభుత్వం నుంచి పెద్దగా నిధులు రాక పోయినప్పటికీ ఆస్తిపన్ను రూపంలో వచ్చిన సొంత నిధులతో నెట్టుకొస్తోంది. నార్సింగి, బండ్లగూడలో కొత్త అపార్ట్‌మెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలకు సంబంధించిన ఆస్తులు, వాణిజ్య సముదాయాలపై ఎప్పటిప్పుడు అసెస్‌మెంట్స్ చేసి బిల్లులు జారీ చేస్తే మరింత ఆదాయం సమకూరే అవకాశం ఉంది. రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైన్లు, పార్కులు, ఇతర చిన్నచిన్న పనులకు ప్రభుత్వాన్ని యాచించాల్సిన పని లేదు.

కుంటుపడుతున్న అభివృద్ధి

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలో పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల మున్సిపాలిటీలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఇవి శరవేగంగా విస్తరిస్తున్నాయి. గేటెడ్ కమ్యూనిటీలు, విల్లాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలు భారీగా వెలుస్తున్నాయి. ఆస్తిపన్నులను అసెస్‌మెంట్ చేయడంలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. పన్ను లక్ష్యం ఘనంగా నిర్దేశించుకున్నప్పటికీ వసూళ్లు మాత్రం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. షాద్‌నగర్ నియోజకవర్గం పరిధిలో షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ప్రాపర్టీ టాక్స్‌ల రూపంలో మున్సిపాలిటీలకు తక్కువ ఆదాయం సమకూరుతోంది. ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధిలో కుంటుపడుతోంది. ఆమనగల్లు మున్సిపాలిటీది ఇదే పరిస్థితి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ప్రలోభాలపై ప్రత్యేక నిఘా

- లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి
- అధికారులు సమష్టిగా పనిచేయాలి
- ఇంటలిజెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పారదర్శకంగా, ప్రశాంతంగా లోక్‌సభ ఎన్నికలు జరిగేలా అధికారులు సమష్టిగా పని చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో వ్యయ నియంత్రణ ప్రధాన అంశమని, ప్రతి ఖర్చును లెక్కించాల్సి ఉంటుందని అన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే డబ్బు, మద్యం, కానుకలు, మత్తు పదార్థాలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా పెట్టి .. గుర్తించిన వారిపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇందుకు నియమించిన ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలెన్స్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్, వీడియో వీనింగ్ బృందాలు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ వెలువడిన నాటి నుంచి ఎన్నికల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల ద్వారా ఇప్పటి వరకు రూ.79,41,650 నగదు, రూ.4,18,700 విలువైన సిల్వర్, రూ.37,53,050.5 విలువ గల 5,822.53 లీటర్ల మద్యం, రూ.3,03,25,575 విలువైన 716.925 కిలోల డ్రగ్స్/నార్కొటిక్స్‌ను సీజ్ చేసినట్లు కలెక్టర్ వివరించారు. ఆబ్కారీ, రవాణా, వాణిజ్య పన్నులు తదితర శాఖల సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, రూ.10 లక్షలు పైగా పట్టుపబడిన సందర్భంలో ఆదాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. బ్యాంకు లావాదేవీలపై ప్రతి రోజు నివేదిక ఇవ్వాలన్నారు. అక్రమ మద్యం నిల్వలు, మద్యం రవాణాపై దాడులు నిర్వ హించాలని ఆబ్కారీ అధికారులకు సూచించారు. గత శాసన సభ ఎన్నికల మాదిరే ఈ ఎన్నిక ల్లో అధికారులు సమష్టిగా కృషి చేస్తూ అక్రమ డబ్బు, మద్యం, కానుకలను అరికట్టాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్‌ఓ సంగీత, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్, సైబరాబాద్ ఏసీపీ చంద్రకుమార్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సుభాష్‌చంద్ర, ఎక్స్ పెండిచర్ నోడల్ అధికారి సురేష్ మోహన్, ఎన్నికల విభాగం అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవకే జీవితం అంకితం

- చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



సోలీపేట్‌లో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: ప్రజాసేవకే తన జీవితం అంకితం చేస్తానని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా గురువారం మండల పరిధిలోని సోలీపేట్, మద్దూరు, హైతాబాద్, చందనవెల్లి, రుద్రారం, నాగర్‌గూడ, తాళ్లపల్లి, తిమ్మారెడ్డిగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు అడిగి తెలుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను బొంద పెట్టాలని అన్నారు బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీనే తనకు ఆదర్శమన్నారు. చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం మాట్లాడుతూ.. ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు నిరంతరం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాము, కూతురు మహేందర్, మాణెయ్య, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మహేశ్, రాజు, అనంతయ్య, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జాతీయ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ శశాంక వెల్లడించారు. చైర్మన్‌గా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, కన్వీనర్‌గా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, సభ్యుడిగా ట్రెజరీ అధికారి వెంకట్‌రెడ్డిని నియమించారు. వివరాలకు 98497 20054 నంబర్‌లో సంప్రదించొచ్చు.



ఓటు వేసేందుకు వచ్చిన ఆమనగల్లు ప్రజాప్రతినిధులు

ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రశాంతం

- క్యాంపుల నుంచి నేరుగా పోలింగ్ కేంద్రానికి ఓటర్లు
- వందశాత ఓటింగ్ నమోదు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు

షాద్‌నగర్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఉప ఎన్నిక గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. షాద్‌నగర్ పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న సమావేశ మందిరంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలు, షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలటీలు, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలతో పాటు ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎమ్మెల్యే ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 77, మహిళలు 94 మొత్తం 171 మంది ఓటు వేశారు. వంద శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట మాధవరావు తెలిపారు.


క్యాంపుల నుంచి నేరుగా..

కాంగ్రెస్ నుంచి పారిశ్రామికవేత్త మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్‌గౌడ్ బరిలో నిలిచారు. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఓటర్లను క్యాంపులకు తీసుకెళ్లి ప్రత్యేక బస్సుల్లో నేరుగా పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 2గంటల వరకు ముగిసింది.

భారీ బందోబస్తు

ఎన్నికల నిర్వహణకు నలుగురు పోలింగ్ ఆఫీసర్లు, 13 మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు, నలుగురు సెక్టార్ ఆఫీసర్లను నియమించారు. ఏసీపీ రంగస్వామి ఆధ్వర్యంలో పట్టణ సీఐ ప్రతాప్‌లింగం నేతృత్వంలో ఏడుగురు సీఐలు, 20 మంది ఎస్‌ఐ, ఏఎస్‌ఐలు, 63 మంది కానిస్టేబుళ్లతో పాటు సీఆర్‌పీఎఫ్ బలగాలతో గట్టి పోలీసు బందోబస్తు చేపట్టారు.





ఓటు వేసిన కేశంపేట జెడ్పీటీసీ తాండ్ర విశాల, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితరులు

సృజనకు పదును.. భవితకు దన్ను

- 'స్పార్కిల్స్' పేరిట సమ్మర్ క్యాంప్
- రాష్ట్రంలోని పది కళాశాలల నుంచి హాజరైన విద్యార్థినులు
- ఆయా అంశాల్లో ప్రత్యేక తర్ఫీదు
- నేటితో ముగియనున్న శిక్షణ శిబిరం



లైఫ్ స్కిల్స్‌పై అవగాహన



యంగ్ జర్నలిజంపై శిక్షణ

మొయినాబాద్‌రూరల్: సెలవుల్లో విద్యార్థినుల సృజనకు పదును పెట్టేందుకు.. వారికి భవిష్యత్‌పై భరోసా కల్పించేందుకు వివిధ అంశాల్లో శిక్షణ నిస్తోంది మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ చేవెళ్ల గురుకుల కళాశాల. 'స్పార్కిల్స్' పేరుతో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పూర్తి చేసిన వారికి సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని పది కళాశా లకు చెందిన విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. శంకర్‌పల్లి-1, శంకర్‌పల్లి-2, చేవెళ్ల, బంట్వారం, మోమిన్‌పేట్-1, మోమిన్‌పేట్-2, కోకట్, జహీరాబాద్, ఆమనగల్లు, మహేశ్వరం కళాశాలల నుంచి విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా లైఫ్ స్కిల్స్, మొబైల్ యాప్, హంటర్‌ప్రీనియర్‌షిప్, యంగ్ జర్నలిజంపై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు.

ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తూ..

శిక్షణ శిబిరంలో ఆయా కళాశాలల విద్యార్థినులకు లైఫ్‌స్కిల్స్.. వ్యక్తిగత సంబంధాలను పెంపొందించుకోవడం.. ఇతరులతో ఎలా నడుచుకోవాలన్నదానిపై తరగతులు నిర్వహిస్తున్నారు.మొబైల్ యాప్స్, వ్యాపార సంబంధిత విషయాలపై అవగాహన కల్పించడం,పత్రిక రచనలు, వార్తా పత్రికల్లో వార్తలు,వ్యాసాలను సేకరించడం, రచించడం అనే అంశాల పై క్లాసులు నిర్వహిస్తు ప్రాక్టికల్‌గా చేసి చూపిస్తున్నారు.విద్యార్థులు ఉత్సాహంగా ఆయా అంశాలపై తర్ఫీదు పొందుతున్నారు.ఈ నెల 15న ప్రారంభమైన శిబిరం 29వ తేదీతో ముగియనుంది.

నైపుణ్యం పెంపే లక్ష్యం



విద్యార్థినుల్లో విజ్ఞాన నైపుణ్యం కోసమే ఈ శిక్షణ శిబిరం ఏర్పాటు చేశాం.ఇక్కడ రాష్ట్రంలోని పది కళాశాలలకు చెందిన విద్యార్థినులకు ఆయా అంశాలపై శిక్షణ ఇప్పిస్తున్నాం.

– బి.సంతోషి, రాష్ట్ర గురుకులాల ఓఎస్‌డీ

అన్ని రకాల సౌకర్యాలు



విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించడం కోసమే ప్రభుత్వం సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసింది. కళాశాలలో విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశాం. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. విద్యార్థినులు ఆసక్తిగా నేర్చుకుంటున్నారు.

– రమాదేవి, చేవెళ్ల కళాశాల ప్రిన్సిపాల్

సమ్మర్ క్యాంప్ ఎంతో బాగుంది



సమ్మర్ సెలవుల్లో ఇలాంటి క్యాంప్‌లు నిర్వహించడం బాగుంది. వివిధ కళాశాలల్లో చదివిన వారికి ఒకచోట సమ్మర్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయం. శిక్షణ శిబిరంలో వివిధ అంశాల్లో చక్కగా శిక్షణ ఇస్తున్నారు.

– అశ్రిత, ఇంటర్మీడియెట్, చేవెళ్ల కళాశాల

మరచిపోలేని అనుభూతి



సమ్మర్ క్యాంప్‌లో ఆయా కళాశాలల విద్యార్థులను ఒక్కచోట చేర్చి స్నేహ సంబంధాలు పెంపొందించుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. ఈ వేసవి శిబిరం మరచిపోలేని అనుభూతిని కల్పిస్తోంది.

– జైభేరిసా, ఇంటర్మీడియెట్ మహేశ్వరం కళాశాల

నేటి నుంచి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌లో వేంకటేశ్వస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్నట్లు అసోసియేషన్ ప్రెసిడెంట్ పీఈటీ మల్లేశ్ గురువారం తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సుమారు 60 టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటాయని తెలిపారు. స్త్రీ పురుషులకు వేరువేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సంప్రదించాలని కోరారు. భోజన సదుపాయం ఉంటుందని చెప్పారు.

యువత క్షణికావేశానికి గురికావొద్దు


ప్రజలతో మాట్లాడుతున్న డీసీపీ సునితారెడ్డి


కవాతులో పాల్గొన్న పోలీసు సిబ్బంది

మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి

మంచాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంత జీవితాలను గడపాలని మహేశ్వరం డీసీపీ సునితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఆరుట్ల గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేకంగా పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఎన్నికల వేళ ఎలాంటి ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలు పోలీసులకు పూర్తి సహకారం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో క్షణికావేశంలో గొడవలు పడి జీవితాలను పాడు చేసుకోవద్దన్నారు. ప్రధానంగా చదువుకున్న యువత మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. అదే విధంగా ప్రభుత్వం కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఓటింగ్ సమయంలో ప్రలోభాలకు గురి కావొద్దన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ వెంకట సత్యనారాయణ, ఏసీపీ కేపీవీ రాజు, సీఐ బాబ్యానాయక్, ఎస్సైలు లాలయ్య, రవినాయక్, ఏఎస్సై సతీష్, నాయకులు రమేశ్, భాస్కర్, జంగయ్యగౌడ్, శంకరయ్య, ఐలయ్య, రాజు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

రూ.10 లక్షల నగదు పట్టివేత

- బీఆర్‌ఎస్ నేతల కారులో స్వాధీనం
- ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎన్నికల అధికారి సూరజ్ కుమార్

మహేశ్వరం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని మన్సాన్‌పల్లి- ఘట్టుపల్లి రహదారిపై గురువారం పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా రూ.10 లక్షల నగదు పట్టుబడింది. ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు బీఆర్‌ఎస్ నేతలు నగదును తరలించారని అధికారులు తెలిపారు. మహేశ్వరం సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూరజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్సాన్‌పల్లి- ఘట్టుపల్లి రోడ్డుపైన ఎన్నికల అధికారులు, పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వర్తిస్తుండగా కారులో రూ.10 లక్షల నగదు లభ్యమైంది. దీనిపై విచారించగా ఎలాంటి పత్రాలు చూపచకపోవడంతో సీజ్ చేశారు. కారులో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలానికి చెందిన అంకు సురేందర్, ఎడిమోని లాలయ్యను గుర్తించారు. ఈ డబ్బును ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఘట్టుపల్లి గ్రామ శివారులో ఉన్న కోరుపోలు చంద్రారెడ్డి ఫామ్ హౌస్‌లోని కల్వకుర్తి, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ అసెంబ్లీ స్థానాల సభ్యులకు డబ్బులు పంపిణీ చేసేందుకు తెస్తున్నారు. గ్రామ శివారులోని ఓ ఫామ్ హౌస్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా పోటీ చేసిన నవీన్‌రెడ్డి ఓటర్లతో సమావేశం నిర్వహించారు. ఓటర్లకు డబ్బులు తీసుకెళ్తున్న కారును ఆపి తనిఖీ చేసి నగదు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు కారును సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

భానుడి ప్రతాపం
వడదెబ్బ ప్రమాదం

- రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం పది దాటితే బయటికు రాని జనం
- నిర్మానుష్యంగా రహదారులు


దామోదర్, జిల్లా ఉప వైద్యాధికారి


షాబాద్‌లో మధ్యాహ్నం వేళ నిర్మానుష్యమైన రోడ్డు

షాబాద్: రోజు రోజుకు భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ముదురుతున్న ఎండలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మార్చి నెలాఖరులోనే సూర్యుడు భగ్గుమంటున్నాడు. మరో రెండున్నర నెలల పాటు వేసవి కాలం ఉండగా ప్రస్తుత ఉష్ణోగ్రతలకు జనాలు భీతిల్లుతున్నారు. ప్రస్తుతం పగటి ఉష్ణోగ్రతలు 39 డిగ్రీలకు చేరాయి. ఉదయం 10 దాటిందంటే చాలు జనాలు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులు దాపురించాయి. ప్రధాన రహదారులతో పాటు, వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. విపరీతమైన ఎండలు కాసే సమయంలో విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు, కూలీలు బయట తిరగకుండా ఉండటం మంచిదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒకవేళ వెళ్లాల్సి వస్తే జాగ్రత్తలు పాటించాలని, లేదంటే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుదన్నారు. ఎండలు ముదరడం వర్షాభావ పరిస్థితుల కారణంగా బోరు బావుల్లో నీళ్ల తగ్గిపోయి చాలావరకు పొలాలు ఎండిపోతున్నాయి. రానున్న రోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశముందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

పది దాటితే చుక్కలే..

వేసవి ప్రారంభం నుంచి కూడా జిల్లాలో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. శీతాకాలం ఉన్నట్టుగానే ఉదయం 8గంటల వరకు కూడా మంచు ప్రభావం తగ్గడం లేదు. నవంబర్ నుంచి ఇలాగే ఉండడంతో వరి పొలాలకు చీడపీడల బెడద తీవ్రంగా ఉంది. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత మాత్రం ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. వారం రోజులుగా నమోదవుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వ్యవసాయ కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్లల్లోనూ వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఈ మేరకు తప్పనిసరిగా తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉప వైద్యాధికారి దామోదర్ సూచించారు.

వడదెబ్బ లక్షణాలు

- ఎండదెబ్బకు గురైతే శరీరానికి చెమట పట్టదు.. చర్మం పూర్తిగా పొడిబారుతుంది.
- వాంతులు, విరేచనాలతో సొమ్మసిల్లుతారు. పూర్తిగా నీరసించిపోతారు.
- విపరీతంగా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- ఫిట్స్ లేదా అపస్మారక స్థితికి చేరుకుంటారు.

వైద్యం ఇలా..

- వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే చల్లని నీడ ఉన్న ప్రదేశానికి చేర్చాలి.
- శరీరానికి చల్లని గాలి తగిలేలా ఏర్పాట్లు చేయాలి.
- తడి గుడ్డతో శరీరాన్ని తరచుగా తుడుస్తుండాలి.
- ఉప్పు కలిపిన చల్లని మజ్జిగ, లేదా ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలి.
- వీలైనంత తొందరగా దగ్గరలోని ఆస్పత్రులకు తరలించి వెంటనే వైద్యం అందించాలి.

జాగ్రత్తలు

- తరచూ పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రవపదార్థాలను తీసుకోవాలి.
- ఎండలో ముదురు రంగు, నలుపు దుస్తులు వాడరాదు.
- లేత రంగులు కలిగి తేలికైన వదులుగా ఉన్న దుస్తులను వాడాలి.
- రోడ్ల మీద అమ్మే వేపుడు పదార్థాలను తినడం తగ్గించాలి.
- దోస, పుచ్చ, తాటి ముంజలతో పాటు తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.
- మద్యం తాగరాదు. మాంసాహారాన్ని తగ్గించాలి.
- బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, జేబు రుమాలు, తలపాగాలు ధరించాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులు ఎండలో తిరగకుండా నీడ పట్టున ఉంటే మంచిది.

ఎండలు దంచుతున్నాయి



మండుతున్న ఎండలతో ఇబ్బందులు పడుతున్నా. వ్యవసాయ పనులు చేసుకోలేక పోతున్నా. పగలు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతుంటే రాత్రి దోమలతో వేగలేక పోతున్నాం. మార్చిలోనే ఇంతగా ఎండలు మండుతున్నాయి. ఇక ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటాయోనని భయంగా ఉంది.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎర్రోనిగూడ

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

తలకొండపల్లి: కుటుంబ వివాదాల నేపథ్యంలో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని ఇబ్రాయిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణ(55) రోజూ కుటుంబ వ్యవహారాలతో సతమతమయ్యేవారు. దీంతో మనస్తాపం చెంది గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న ఓ పొలంలో పురుగుల మందు తాగి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున కృష్ణ మృతి చెందాడు. మృతుడికి భార్య యాదమ్మతో పాటు, ఓ కుమారుడున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

కొందుర్గు: ఎదురెదురుగా వస్తున్న బైక్, కారు ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం శ్రీరంగాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన సురేష్‌గౌడ్ మోటార్ సైకిల్‌పై షాద్‌నగర్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు శ్రీరంగాపూర్ వద్ద బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న సురేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యానికి ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ విషయమై సురేష్‌గౌడ్ బంధువు లింగంగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


కవిత (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలో పిగ్లీపూర్ గ్రామానికి చెందిన దాసరి కవిత(40) కుమార్తె వైష్ణవితో ఈ నెల 21న ఫోన్లో మాట్లాడారు. అదే రోజు సాయంత్రం మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుండడంతో మరుసటి రోజు ఇంటికి వచ్చి ఆమె చూడగా తాళం వేసి ఉంది. తల్లి రాకపోవడంతో వైష్ణవి బంధువులకు వాకబు చేయగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శునకం అడ్డొచ్చి.. విషాదం మిగిల్చి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు


లక్ష్మమ్మ (ఫైల్)

కొందుర్గు: శుభకార్యానికి వెళ్తున్న వదిన, మరిది రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో వదిన మృతి చెందగా.. మరిదికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జిల్లేడ్ చౌదరిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సక్రమ్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పరిగి మండలం కాళ్లపూర్ గ్రామానికి చెందిన భీమయ్య తన వదిన లక్ష్మమ్మ(55)తో కలిసి జడ్చర్లలో బంధువుల పెళ్లికి గురువారం ఇంటి నుంచి బయలుదేరారు. కాగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం లాల్‌పహాడ్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో బైక్ నుంచి ఇద్దరు పడిపోయారు. ఈ సంఘటనలో లక్ష్మమ్మ తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. భీమయ్యకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా లక్ష్మమ్మ మృతి చెందారు. భీమయ్య శంషాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై మృతురాలి కుమారుడు నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై తెలిపారు.

సీఎం రాకతో భారీగా ట్రాఫిక్


చేవెళ్లలో రోడ్డుపై భారీగా నిలిచిన వాహనాలు

హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై వాహనదారుల ఇక్కట్లు


ట్రాఫిక్ ఆంక్షలతో కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్తున్న ప్రయాణికులు

చేవెళ్ల: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో చేవెళ్ల మీదుగా కొడంగల్ వెళ్లడంతో హైదరాబాద్– బీజాపూర్ రహదారిపై వాహనదారులకు ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యాయి. గురువారం ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రోడ్డు మార్గంలో అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల మీదుగా కొండగల్‌కు వెళ్లారు. జాతీయ రహదారి అయినప్పటికీ విస్తరణకు నోచుకోకపోవటంతో ఇరుకుగా మారి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోజూ ఈ మార్గం గుండా వెళ్లే వాహనదారులు నరకయాతన పడుతున్నారు. అలాంటి రోడ్డుపై రాష్ట్ర సీఎం వస్తుంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. పోలీసులు పెద్దఎత్తున బందోబస్త్ ఏర్పాటు చేశారు. ముందుగానే పలు రూట్లలో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు. దీంతో వాహనదారులకు రోడ్డుపై ఇబ్బందులు ఏర్పడ్డాయి. మొయినాబాద్, చేవెళ్ల మండలాల పరిధిలోని ఈరోడ్డు వెంబడి ఉన్న వాహదారులకు చుక్కలు కనిపించాయి. ఆలూరు గేట్ వద్ద వికారాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను దారి మళ్లించారు. చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల, కందవాడ గేట్ వద్ద సైతం వాహనాల దారిని మార్చారు. పెళ్లిళ్లు కూడా ఎక్కువగా ఉండటంతో భారీగా ప్రజలు రోడ్లపై కనిపించారు. ఒక వైపు ఎండలు మండిపోతుండటంతో పెళ్లిళ్లకు వెళ్లే ప్రజలు సైతం అవస్థలు పడ్డారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఈరోడ్డుపై దృష్టి పెట్టి విస్తరణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరారు.

కాటేదాన్ పారిశ్రామికవాడలో అగ్ని ప్రమాదం



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం జరిగింది. కాటేదాన్ పారిశ్రామికవాడలోని పాయల్ ఫుడ్ బిస్కట్ కంపెనీలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో భారీగా ఆస్తినష్టం వాటిల్లినట్లు సమాచారం. పోలీసుల కథనం ప్రకారం.. పాయల్ ఫుడ్ బిస్కట్ కంపెనీలో సుమారు వంద మందికిపైగా నైట్ షిఫ్ట్‌లో పని చేస్తున్నారు. ఈ క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌తో మూడో అంతస్తులో మంటలు చెలరేగాయి. ఈ అంతస్తులో బిస్కట్ ప్యాకింగ్ మెటీరియల్ ఉండటంతో మంటలు తీవ్ర స్థాయిలో వ్యాపించడంతో కార్మికులు అప్రమత్తమై బయటికి పరుగులు తీశారు. ఘటనా స్థలానికి మొదట రెండు ఫైరింజిన్‌లు వచ్చినా మంటలను అదుపు చేయలేకపోయాయి. దీంతో మరో ఆరు ఫైరింజిన్లు, స్కైలిఫ్ట్ ఫైరింజన్‌తో మంటలను అదుపు చేశారు. భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు కంపెనీ యాజమాన్యం తెలిపింది.

తల్లీకుమారుల అదృశ్యంపై కేసు నమోదు


లావణ్య, కుమారులు జశ్వంత్, కార్తీక్ (ఫైల్)

మొయినాబాద్: భర్త ఫంక్షన్‌కు వెళ్లి వచ్చేసరికి ఇద్దరు పిల్లలతో సహా భార్య అదృశ్యమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నమంగళారంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి శంకర్ ఈ నెల 26న ఫంక్షన్‌కు వెళ్లాడు. అదే సమయంలో ఆయన భార్య లావణ్య(35), కుమారులు జశ్వంత్(9), కార్తీక్(7) ఇంట్లోనే ఉన్నారు. ఆయన తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఎవరూ లేరు. దీంతో లావణ్యకు ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్ వచ్చింది. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆయన గురువారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కిషన్‌నగర్‌లో..


మంజుల, సందీప్ (ఫైల్)

కొందుర్గు: తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని పర్వతాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్ గ్రామానికి చెందిన మంజులతో కొందుర్గు మండలం దర్గా నర్సింలుకి 14 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉంది. అయితే నర్సింలు తరచూ మద్యం తాగి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో మంజుల చిన్న కుమారుడు సందీప్‌ను తీసుకొని షాద్‌నగర్ ఆస్పత్రికి వెళ్తానని బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో గురువారం మంజుల తమ్ముడు శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు పట్టుబడ్డారు. ఈ సంఘటన గురువారం ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. దూల్‌పేట్‌కు చెందిన రాజాసింగ్, ఇంజపూర్‌కు చెందిన లోకేశ్వర్ గంజాయి విక్రేతలు. రాజాసింగ్ గంజాయి తీసుకొచ్చి లోకేశ్వర్‌కు ఇస్తాడు. లోకేశ్వర్ స్థానికంగా విక్రయిస్తాడు. ఈక్రమంలో రాజాసింగ్ రెండు కేజీల గంజాయితో బీరప్ప గుడివద్ద ఉండగా ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు పట్టుకున్నారు. అనతరం లోకేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని 1.2 కిలోల సరుకు స్వాధీనం చేసుకుని ఇరువురినీ అరెస్టు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిసింది.